

ఇంటింటా అక్షింతలు పంపిణీ

రామగుండం: శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ కమిటీ, హిందూ వాహిని ఆధ్వర్యంలో సోమవారం అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు.



విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

జ్యోతినగర్: మల్కాపూర్‌లోని శివ పంచాయతన ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
31.4/15.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కమ్ముకుంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బియ్యం రీసైక్లింగ్‌ను కట్టడి చేయాలి

పెద్దపల్లిరూరల్: పేదల బియ్యం రీసైక్లింగ్ దందాను అధికారులు కట్టడి చేయాలని, ఈనెలాఖరు వరకు సీఎంఆర్ డెలివరీ పూర్తిచేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సచివాలయం నుంచి సోమవారం సీఎంఆర్ డెలివరీ, ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ, ధాన్యం కొనుగోలు తదతర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈనెల 31వరకు సీఎంఆర్ డెలివరీ పూర్తికావాలని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌లో పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. అయితే, పెండింగ్ సీఎంఆర్ డెలివరీపై ప్రత్యేక దృష్టిసారించామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఎఫ్‌సీఐకి ఈనెల 25వరకు సీఎంఆర్ డెలివరీ చేస్తామని పేర్కొన్నారు. డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం నాణ్యమైన సన్నరకం బియ్యాన్నే అందించాలని, సరైన తూకంతో బియ్యం సరఫరా చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఈవో మాధవి, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్‌రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. ఈ సందరర్భంగా ఆయన మాట్లాడారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేసే బియ్యం స్కూళ్లకు నేరుగా చేరవేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నాణ్యత, తూకం విషయంలో రవాణా కాంట్రాక్టర్లు, మధ్యాహ్న భోజన వర్కర్లు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. తూకం, నాణ్యతపై ఫిర్యాదులు అందితే గోదాం ఇన్‌చార్జిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


టెన్త్ విద్యార్థులపై శ్రద్ధ



మాట్లాడుతున్న డీఈవో మాధవి

జ్యోతినగర్(రామగుండం): ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి సూచించారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం చేట్టిన బయోసైన్స్ అప్పర్ ప్రైమరీ లెవల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉన్నతి కార్యక్రమం అమలు చేయాలన్నారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి షేక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జయరాజ్, ఉపాధ్యాయులు అంజన్‌కుమార్, రవీందర్, రాణి, సీఆర్‌పీ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: ఇటీవల హన్మకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2023 జాతీయస్థాయి పోటీల్లో గోదావరిఖని ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ రెడ్ డ్రాగన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఎస్.హర్షిత్, ఎస్.గౌతమ్, కె.విష్ణు, పి.జోసఫ్, దాసరి చరిత్ బంగారు, ఎస్.కార్తీక్, కుసుమ అఖిల్ సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ మొండయ్య, సీనియర్ కోచ్ క్రాంతికుమార్ అభినందించారు.

అప్రెంటిస్ మేళాకు స్పందన



మేళాకు హాజరైన అభ్యర్థులు

రామగుండం: స్థానిక ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా (పీఎంఎన్‌ఏఎం)కు విశేష స్పందన వచ్చింది. మేళాకు 216 మంది హాజరు కాగా కేశోరాం సిమెంట్, ఆదర్శ ఆటో మోటార్స్, వరుణ్ మోటార్స్, ఎల్ అండ్ టీ, రేనె తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెరిట్ ఆధారంగా త్వరలోనే అర్హులను ఎంపికచేసి జాబితా వెల్లడిస్తామని కంపెనీల ప్రతినిధులు ప్రకటించారు. అప్రెంటిస్ అడ్వయిజర్/ట్రెనింగ్ ఆఫీసర్ విద్యాసాగర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సురేందర్ పాల్గొన్నారు.

కంపుకొడుతున్న 'కార్పొరేషన్'

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండో మున్సిపల్ కార్పొరేషన్ రామగుండం. ఆర్థిక వనరులూ అత్యధికమే. జనాభా, విస్తీర్ణంలోనూ ఎక్కడా తీసిపోదు. రాజకీయ చైతన్యమూ ఎక్కువే. ఉన్నత విద్యావంతులైన అధికారులు, ప్రజాసేవకే అంకితమైన ప్రజాప్రతినిధులకు కొదవ లేదు. అయినా, నివాసాల ఎదుట మురుగునీటి పారకం, అపరిశుభ్ర వాతావరణం, బహిరంగ ప్రదేశాల్లోనే మూత్రవిసర్జన చేయడం లాంటివాటిని నియంత్రించలేక పోతున్నారు. అందుకే కేంద్రప్రభుత్వం ప్రకటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో పోటీపడలేకపోతోందనే అపవాదు మూటగట్టుకుంటున్నారు.

– కోల్‌సిటీ(రామగుండం)

- మురుగు పారుతున్న మ్యాన్‌హోళ్లు
- బహిరంగంగానే మల, మూత్ర విసర్జన
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వెనకబడుతున్న బల్దియా
- ఓడీఎఫ్–ప్లస్ ర్యాంక్‌తోనే సరిపెట్టుకున్న 'రామగుండం'



- ఇది ఎన్టీపీసీ– ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు కూడలిలోని సులభ్ కాంప్లెక్స్. నిత్యం తాళం వేసి ఉండడంతో గత్యంతరం లేక దాని పక్కనే ఇలా మూత్రవిసర్జన చేస్తున్నారు.

సాక్షి

- ఇది నగరం నడిబొడ్డున ఉన్న 28వ డివిజన్‌లోని వినోభనగర్. ఇంటి గుమ్మం ఎదుట ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు ఎగిసిపడి కాలనీలో పారుతోంది. ఒక ట్రెండురోజులు కాదు.. ఆర్నెల్లుగా ఇలాగే ఉంది. దుర్గంధం భరించలేక స్థానిక కుటుంబాలు సతమతమవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.
- ఇలాంటి దుస్థితి రామగుండం కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్ సాధించలేకపోవడానికి కారణమవుతోంది.





మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనకాల బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్న ఓ వ్యక్తి

బహిరంగ మల, మూత్రవిసర్జనను అరికట్టి స్వచ్ఛ పల్లెలు, పట్టణాలు, నగరాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు ఎనిమిదేళ్ల క్రితం స్వచ్ఛభారత్‌ను అమలులోకి తెచ్చాయి. వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు నిర్మించాయి. వీటి నిర్వహణ తీరును మరింత మెరుగుపర్చుకోవడానికి స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ర్యాంక్‌లు కేటాయిస్తున్నాయి. ఈ పోటీలకు బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత నగరం(ఓడీఎఫ్–ఓపెన్ డిఫెక్షన్ ఫ్రీ) కింద ప్రత్యేకంగా కేటాయించే మార్కులు చాలాకీలకం. ఓడీఎఫ్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన వాటికి ఓడీఎఫ్, ఓడీఎఫ్–ప్లస్, ఓడీఎఫ్–ప్లస్ ప్లస్, ఓడీఎఫ్, వాటర్–ప్లస్ గుర్తింపు ఇస్తున్నాయి. రామగుండం నగరపాలక సంస్థ ఏడేళ్లుగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పోటీ పడుతోంది. కానీ ఓడీఎఫ్ నుంచి ఓడీఎఫ్–ప్లస్ వద్దే ఆగిపోయింది. చిన్న మున్సిపాలిటీలు ఓడీఎఫ్–ప్లస్ ప్లస్, వాటర్–ప్లస్ స్థాయి దక్కించుకుంటున్నా..

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్‌లు ఇలా..

సంవత్సరం	ఓడీఎఫ్	ర్యాంక్
2016	–	–
2017	–	191
2018	ఓడీఎఫ్	194
2019	ఓడీఎఫ్	192
2021	ఓడీఎఫ్–ప్లస్	211
2022	ఓడీఎఫ్–ప్లస్	92
2023	ఓడీఎఫ్–ప్లస్	ఇంకాప్రకటించలేదు

ఓడీఎఫ్‌కు కేటాయించే మార్కులు ఇలా..

వాటర్–ప్లస్	1125
ఓడీఎఫ్–ప్లస్ ప్లస్	725
ఓడీఎఫ్–ప్లస్	525
ఓడీఎఫ్	325

రామగుండం తన పనితీరు మెరుగుపర్చుకోక పోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఓడీఎఫ్–ప్లస్‌తోనే సరిపెట్టుకున్నారు..

- గతేడాది ఓడీఎఫ్–ప్లస్ ర్యాంక్ సాధించిన రామగుండం బల్దియా.. ఈ ఏడాది కూడా ఓడీఎఫ్ ర్యాంక్‌ల్లో ఓడీఎఫ్–ప్లస్‌తోనే సరిపెట్టుకుంది.
- పాలకులు, అధికారులు తగిన శ్రద్ధ చూపకపోవడంతోనే పోటీల్లో గుర్తింపు పొందలేకపోతోందనే అపవాదు మూటగట్టుకుంటున్నారు.
- ప్రధానంగా మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) నిర్మాణ పనులు పూర్తికాకపోవడం, దీనిపై పాలకులు, అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకోకపోవడం, ఇటీవల రూ.లక్షలు వెచ్చించి వినియోగంలోకి తెచ్చిన మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం(ఎఫ్‌ఎస్‌టీపీ) స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో గుర్తింపు పొందకపోవడంతో ఓడీఎఫ్–ప్లస్ ప్లస్‌ను సాధించలేకపోయింది.
- మరో వారం రోజుల్లో కేంద్రప్రభుత్వం ప్రకటించనున్న స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్‌పై ఇవి తీవ్ర ప్రభావం చూపుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

మంచి మార్కులు సాధిస్తాం



స్వచ్ఛ సర్వేక్షణ్ ఓడీఎఫ్ టూల్‌కిట్‌లో పొందుపరిచిన నిబంధనల ప్రకారం నగరంలో మార్పులు తీసుకొస్తాం. ఎస్‌టీపీ నిర్మాణంపై దృష్టి సారించాం. ఎఫ్‌ఎస్‌టీపీని వినియోగంలోకి తీసుకొచ్చాం. మేయర్, కార్పొరేటర్ల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచిఫలితాలు సాధిస్తాం.

– నాగేశ్వర్, కమిషనర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్

ఎందుకీ నిర్లక్ష్యం?

బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత(ఓడీఎఫ్) నగరంగా తీర్చిదిద్దడంలో బల్దియా పూర్తినిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి రామగుండంలో చేపట్టిన ఎస్‌టీపీల నిర్మాణం పూర్తిచేయకుండా మురుగు నీటిని గోదావరి నదిలోకి నేరుగా విడుదల చేస్తున్నారు. మల్కాపూర్ శివారులో మానవ మల వ్యర్థాలను శుద్ధి చేసే ప్లాంట్(ఎఫ్‌ఎస్‌టీపీ–ఫీకల్ స్లెడ్జ్ ట్రీట్‌మెంట్)ను వినియోగంలోకి తెచ్చినా.. గతేడాది ఆగస్టులో ఓడీఎఫ్ తనిఖీ కోసం వచ్చిన క్యూసీఐ బృందానికి చూపించలేదు. 24 గంటలపాటు నీటి సరఫరా చేయకపోవడం కూడా ఓడీఎఫ్‌లో సరైన గుర్తింపు దక్కక పోవడానికి కారణమని అంటున్నారు. మహిళల మరుగుదొడ్లలో శానిటరీ ప్యాడ్ కోసం వెండింగ్ మెషిన్, పేపర్ న్యాప్‌కిన్ అందుబాటులో ఉంచకపోవడం, నిరంతరం సులభ్ కాంప్లెక్స్‌లను తనిఖీ చేయలేకపోవడంతో అవి కంపుకొడుతున్నాయి. సాక్ష్యాత్తు రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలోని టాయిలెట్లు నిర్వహణ లోపంతో కంపుకొట్టడం బల్దియా పనితీరుకు అద్దంపడుతోంది. ఇక నగరంలోని పలు డివిజన్లలో యూజీడీ పైపులు, మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు వరదలా పారుతున్నా తగిన చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది.

మా బడిని బాగుచేయండి సార్

- కలెక్టర్‌కు విన్నవించిన విద్యార్థులు



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న విద్యార్థులు

కోల్‌సిటీ(రామగుండం): 'మా బడిలో బాత్‌రూంలు లేవు.. తాగునీటి సౌకర్యం లేదు.. వంటి గది లేదు.. తరగతి గదిలోనే వంట చేస్తున్నరు.. కనీసం ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్ లేదు.. స్కూల్ బిల్డింగ్ పైకప్పు కూలిపోయేలా ఉంది.. ప్లీజ్ సర్.. కొంచం మా బడిని బాగు చేయండి సర్' అని పలువురు విద్యార్థులు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు విన్నవించారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కలెక్టర్ హాజరయ్యారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు సమీపంలోని ప్రభుత్వ పాఠశాల సమస్యలను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు చెరుకూరి ఇజ్రాయిల్, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ కీర్తి నాగరాజుతో కలిసి కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. స్పందించిన కలెక్టర్.. స్కూల్‌ను స్వయంగా సందర్శిస్తానని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలని ఆయన సూచించారు.

సందర్శకులొస్తున్నారు..



మ్యూజియంలో సందర్శకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని చారిత్రక, పురాతన కట్టడాల వివరాలు, ఆధారాలు, వివిధ చిత్రాలు, కళాఖండాలు, చారిత్రక చిహ్నాలు ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని సందర్శించేందుకు అతిథులు భారీగా తతరలి వస్తున్నారు. ధూళికట్ట బౌద్ధస్తూపం, రామగిరిఖిల్లా, కోటిలింగాల తదితర చారిత్రక ప్రదేశాల ఛాయాచిత్రాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. శాతవాహనుల ఆనవాళ్లను అందుబాటులో ఉంచారు. సోమవారం ప్రజావాణికి వచ్చిన వారిలో చాలామంది ప్రజలు మ్యూజియం సందర్శించి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

- రైల్వే ఉద్యోగ సంఘాల డిమాండ్
- ప్రారంభమైన నిరసన దీక్షలు

పాత పింఛన్ విధానం పునరుద్ధరించండి

రామగుండం: కొత్తది రద్దు చేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలనే డిమాండ్‌తో రెండు రైల్వే ఉద్యోగ సంఘాలు సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో నిరసన దీక్షలు ప్రారంభించాయి. ఇందులో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమేన్ అనుబంధ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ (ఎస్‌సీఆర్‌ఈఎస్), ఆలిండియా రైల్వేమేన్స్ ఫెడరేషన్ అనుబంధ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూని యన్(ఎస్‌సీఆర్ ఎంయూ) సంఘాలు న్నాయి. కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు బండారి కనకయ్య, ఇష్తాకార్ అహ్మద్, ఎస్సీ, ఎస్టీ బ్రాంచి సెక్రటరీ దొమ్మాటి సదయ్య తదితరులు సంఘీభావం ప్రకటించారు.

పోలీసుల భద్రత

నిరసన దీక్షల వద్ద రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్, ప్రభుత్వ రైల్వే పోలీస్ గంగారపు తిరుపతి, రామగుండం ఎస్సై బోయ వెంకట్ ఆధ్వర్యంలో శిబిరాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



రిలే దీక్షలో ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు



రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రతినిధుల దీక్ష

పింఛన్‌పై స్పష్టత లేదు



కొత్త విధానంలో పదవీ విరమణ తర్వాత పింఛన్ ఎంత వస్తుందో తెలియదు. ఉద్యోగి బేసిక్, ప్రభుత్వ నిధి రెండింటి మొత్తాలను షేర్ మార్కెట్‌కు మళ్లిస్తున్నారు. ఉద్యోగ విరామణ తర్వాత చెల్లింపులు ఎలా ఉంటాయో తెలియదు.

– అజ్మీరా వీరన్ననాయక్, ఉద్యోగ సంఘం నేత

పోరు సాగిస్తాం



నూతన పింఛన్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి. ఇందుకోసం దేశంలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పింఛన్ స్కీంగా ఏర్పాటైంది. భవిష్యత్‌లోనూ ఇందుకోసం పోరు చేస్తాం.

– పిల్లలమర్రి రవీందర్, ఉద్యోగ సంఘం నేత

'ఖని'లో విద్యుత్ అధికారుల తనిఖీలు

గోదావరిఖనిటౌన్: నగరంలోని కమర్షియల్ షాపుల విద్యుత్ సర్వీసులను సబ్ డివిజన్‌లోని ఇంజినీరింగ్, అకౌంట్స్, ఓ అండ్ ఎం అధికారులు, ఉద్యోగులు సోమవారం విస్తృతంగా తనిఖీ చేశారు. సర్వీసులకు మీటర్లు, వాటి పనితనం, సీల్, కేటగిరీ, లోడ్, గృహ సంబంధిత కనెక్షన్ నుంచి కర్షియల్‌కు వినియోగం తదితర వాటిని తనిఖీ చేసినట్లు సూపరింటెండెట్ ఇంజినీర్(ఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్) బొంకూరి సుదర్శనం తెలిపారు. గృహజ్యోతి ద్వారా విద్యుత్ వినియోగించేవారికి కచ్చితంగా కరెంట్ మీటరు ఉండాలని, ఎస్సీ, ఎస్టీలు ఉచిత విద్యుత్ కోసం కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలని సూచించారు. ఎస్సీలు 22,681 మంది, ఎస్టీలు 2,057మంది కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉచిత విద్యుత్ వినియోగిస్తున్నారని, మిగతా ఎస్సీలు 517 మంది, ఎస్టీలు 75మంది సర్టిఫికెట్లు సమర్పించాలని సూచించారు. తమ పూర్వీకులు చనిపోతే ప్రస్తుతం ఉన్నవారి పేరిట మార్పిడికి అఫిడవిట్, డెత్, క్యాస్ట్ సర్టిఫికెట్లను జతపరిచి దరఖాస్తు చేయాలని చెప్పారు. సేవల కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004250028కు ఫోన్ ఏయాలని సూచించారు. ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మీటరు తనిఖీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దు


- సమస్యలు సకాలంలో పరిష్కరించాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలు
- రామగుండం బల్దియాలో తొలిసారి ప్రజావాణి నిర్వహణ

కోల్‌సిటీ(రామగుండం): ఒకే సమస్యపై ప్రజలు అనేసార్లు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పద్ధతి రాకుండా చూసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో కలెక్టర్ తొలిసారి సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించాక మాట్లాడారు. వివిధ సమస్యలపై అందించే దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని అన్నారు. ఇందుకోసం ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు వివరాలు ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన రిజిస్టర్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక సమస్యపై రెండోసారి దరఖాస్తు రాకుండా చూడాలని, ఇందుకోసం తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. సమస్యలకు పరిష్కారం చూపడమే అధికారుల ప్రాధాన్యత కావాలని అన్నారు. కాగా, అర్జీదారులకు కలెక్టర్ ఆదేశాలతో రసీదులు అందజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, తహసీల్దార్ కుమారస్వామి పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


కరెంట్‌షాక్‌తో చనిపోయిండు



మా ఆయన సందీప్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసిండు. గతేఏడాది జనవరి 12న చెత్త తీస్తుండగా కరెంట్ షాక్ కొట్టి చనిపోయిండు. రూ.5లక్షలు ఇస్తమన్నరు. అప్పుడు ఉద్యోగం పెట్టిస్తమన్నరు. ఇప్పుడెవరూ పట్టించుకుంటలేరు. ఇద్దరు పిల్లలను ఎట్లా సాకుడో అర్థమైతలేదు. సారూ.. దయ చూపండి.

– అయిల పావని, గోదావరిఖని


పింఛను ఇస్తలేరు



ఇన్‌ఫెక్షన్ రావడంతో ఆర్నెల్ల కింద మోకాలు కింది వరకు తీసేసింద్రు. అంతకు ముందే కంటిచూపులేదని పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకున్న. పింఛన్ మంజూరుకాలే. ఇప్పుడైనా పింఛన్ ఇయ్యుంద్రని పెద్దపల్లిలో అధికారులను కలిసి విన్నవించిన. ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు కలెక్టర్‌కు నా బాధ చెప్పుకున్న. పింఛన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించింద్రు.

– గన్నారు గురవయ్య, గోదావరిఖని

మా ప్రాంతాన్ని పట్టించుకోండి



మా ఐదో డివిజన్ ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్‌ఎఫ్‌సీఎల్ నిర్వాసిత, ప్రభావిత ప్రాంతం. శ్రీనగర్‌కాలనీ మెయిన్ రోడ్డును 40 అడుగులకు విస్తరించాలి. ప్రమాదకరమైన ఎన్టీపీసీ వృథా నీటికి గోడ కట్టి అడ్డుకట్ట వేయాలి. గోదావరి నదిలో బ్యాక్ వాటర్‌తో నష్టపోయిన వారికి రూ.లక్ష, రైతులకు పంట పరిహారం ఇవ్వాలి. మల్కాపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి.

– మొహ్మద్ రహీం, మల్కాపూర్

సారూ.. సమస్యలు పరిష్కరించండి..

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్ లాల్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. అభాగ్యుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్

- ఇంటర్ వరకు చదివా.. కంప్యూటర్ పరిజ్ఞానం ఉంది.. ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్టు పద్ధతిన ఏదైనా ఉద్యోగం ఇప్పించి ఆదుకోండి
  – ధర్మారం మండలం ఖిలావనపర్తికి చెందిన దివ్యాంగుడు జక్కుల సంతోష్ వేదన.
- పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని రంగంపల్లిలో వీధిదీపాలు ఏర్పాటు చేయండి. రాత్రివేళ అంధకారం తొలగించండి
  – కాలనీవాసుల విన్నపం
- కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేటలో ఉన్న రేషన్‌కార్డును పెద్దపల్లిలోని ఐదో వార్డుకు బదిలీ చేయండి.
  – అర్జీదారు బోయిని స్వరూప వేడుకోలు.


విరాసత్ చేయండి



మా ఊరిలోని భూమి విరాసత్ చేయాలని దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నది. ప్రజావాణిలో అధికారుల దృష్టికి కూడా తెచ్చా. పేరు మార్పిడి కావడంలేదు. విచారణ జరిపి విరాసత్ చేయండి.

– గొర్రె చంద్రయ్య, జగన్నాథపురం

స్టడీ సర్కిల్ కావాలి



పెద్దపల్లిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి. విద్యావంతులైన యువత పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ఇప్పుడు అవస్థలు పడుతోంది. పర్మినెంట్ ప్రాతిపదికన స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి.

– కనుకుంట్ల సదానందం, కొత్తపల్లి

క్లుప్తంగా

న్యాయవాదులకు చెస్ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ప్రతిమ

కరీంనగర్‌క్రైం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు న్యాయవాదులకు, న్యాయమూర్తులకు కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం న్యాయవాది రఘురామన్ పర్యవేక్షణలో చెస్ పోటీలు నిర్వహించగా జిల్లా జడ్జి బి.ప్రతిమ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం చెస్‌పోటీల్లో న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీవాణి నీరజ, లక్ష్మీ కుమారి, అరుణ, మెజిస్ట్రేట్లు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కరీంనగర్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనకబడిన తరగతుల సంక్షేమ విద్యాశాఖల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియంలో బోధనతో విజయవంతంగా నడుస్తున్న గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వతరగతిలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినీవిద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి ఈనెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

రహదారి పూడ్చివేతపై ఆందోళన

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే రహదారి పూడ్చివేతపై సోమవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ శివారులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి 30 ఏళ్ల క్రితం హస్నాబాద్, చెర్లపల్లి, చల్‌గల్ గ్రామాల ప్రజలు శ్రమదానంతో రహదారిని నిర్మించారు. అయితే దారి పక్కనున్న భూయజమాని రెండురోజుల క్రితం పొక్లెయిన్‌తో పెట్టి తన వ్యవసాయ భూమితోపాటు రహదారిని కూడా తొలగించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రహదారి వద్దకు వెళ్లి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు అర్బన్ ఆర్‌ఐ రాజేందర్ సంఘటన స్థలానికి చేరుకుని పనులను నిలిపివేయించి విచారణ చేపట్టారు. ఆలయానికి వెళ్లే రహదారిని పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

వెంకట్రావుపల్లిలో వాటర్‌ట్యాంకర్ బోల్తా

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని వెంకట్రావుపల్లి పరిసరాల్లో రోడ్డుపై నీళ్లు పడుతున్న వాటర్ ట్యాంకర్ సోమవారం బోల్తా పడింది. వెంకట్రావుపల్లి పరిసరాల్లో ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డుపై పోసిన కంకరపై నీళ్లు చల్లడానికి ట్రాక్టర్ టిల్లర్‌పై వాటర్‌ట్యాంకర్ అమర్చారు. రోడ్డు చివరిలో కంకర వద్ద ట్రాక్టర్ అదుపు తప్పడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

ఉచిత సేవలు ఉత్తవేనా?

- నిగ్గదీయి లేదా ఫిర్యాదు చేయి
- పెట్రోల్ బంకుల్లో ఈ సేవలుండాల్సిందే
- జిల్లాలో చాలా చోట్ల కనిపించని సౌకర్యాలు
- పట్టించుకోని అధికారులు

"కరీంనగర్‌కు చెందిన శ్రీధర్ కమాన్‌కు సమీపంలోని ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకునేందుకు వెళ్లాడు. పెట్రోల్ పోసుకుని, బైక్ టైర్‌లో గాలి నింపాలని అక్కడి సిబ్బందిని కోరగా.. ఇక్కడ అలాంటిదేమీ ఉండదని, గాలి పంపు పనిచేయడం లేదని సమాధానం ఇచ్చారు. చాలాబంకుల్లో గాలి నింపేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు నగరంలో ఉన్నాయి. గాలే కాదు.. చాలా బంకుల్లో మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు కానరావడం లేదు."

కరీంనగర్ అర్బన్: పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవలకు అనుచితంగా వ్యవహరిస్తున్నారు అయితే ఇది మీ కోసమే. బంకుల్లో టైర్లలో గాలి, తాగునీరు, మూత్రశాలలు, ఫోన్ సౌకర్యం తదితర సేవలు ఉచితం. వీటిపై అవగాహన లేకపోవడంతో డబ్బులు వసూలు చేస్తున్నారు. అసలే పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే అదనపు వ్యయం భారంగా మారుతోంది. చిల్లర కదా అనుకుంటే నెలకు రూ.కోట్లలోనే సామాన్యుల జేబుకు చిల్లు పడుతోంది.



నగరంలోని ఓ పెట్రోల్ బంకు

మనం చెల్లించే డబ్బులే..

- డీజిల్ అయినా పెట్రోలైనా లీటరుపై మనం పెట్రోలు బంక్‌కు 4 నుంచి 6 పైసలు కేవలం మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ కోసం చెల్లిస్తున్నాం. ప్రతీ బంకులో టాయిలెట్, మంచినీరు, ఎయిర్ ఫ్రీగా అందించాలి. ఇలా అందిస్తేనే పెట్రోల్ బంకు నిర్వహణకు అనుమతి దొరుకుతుంది.
- చాలామంది ప్రయాణంలో ఉన్న వారు టాయిలెట్ అర్జంట్ అయినప్పుడు పబ్లిక్ టాయిలెట్స్ కోసమో.. నిర్మానుష్య ప్రదేశాల కోసమో వెతుకుతారు. కానీ పెట్రోల్ బంకుకు వెళ్లారు, ఇక మీద ఎమర్జెన్సీ టైంలో దర్జాగా బంక్‌కు వెళ్లండి. అది మన హక్కు
- నగరంలో ఒక బంకులో రోజుకు 10 వేల లీటర్ల చమురు అమ్మితే.. టాయిలెట్ మెయింటెనెన్స్ కాస్ట్ కింద ఆ బంకుకు వచ్చే ఆదాయం రోజుకు రూ.600 అంటే నెలకు రూ.18వేలు. జిల్లాలో ఉన్న అన్ని బంకుల్లో కలిపి వాహనదారులు రోజువారీగా చెల్లిస్తున్న మొత్తం రూ.14లక్షలకు పైనే. ఈ డబ్బుతో టాయిలెట్, మంచినీరు అందించాల్సిన బాధ్యత ఆయా బంక్‌లదే.
- పెట్రోల్ పంపుల వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి ఉండాలి. ఇందుకోసం ఆర్వోయంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. ఏ బంకుల్లోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు. స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని పెట్రోలు, డీజిల్ బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.
- అత్యవసర పరిస్థితుల్లో చరవాణి వినియోగించుకునే సదుపాయం పంపుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోలు పంపును సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కు అయినా కాల్స్ చేసుకోవచ్చు.
- వాహన టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఓ వ్యక్తిని అందుబాటులో ఉంచాలి. ఈ సౌకర్యం పూర్తిగా ఉచితంగా పొందొచ్చు. ఐవోసీ గాలికి ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు.
- ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె లేదా రిజిస్టరు అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారులు తమ ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రథమ చికిత్స కిట్ సౌకర్యం ప్రతీ బంకు వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది.
- చమురు నాణ్యత, ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోలు, డీజిల్ నాణ్యత, పరిమాణాన్ని తెలుసుకునేందుకు ఫిల్టర్ పేపర్లు అందుబాటులో ఉంచాలి. వాటి ద్వారా నాణ్యతను పరీక్షించుకునే హక్కు మనకు ఉంటుంది
- పెట్రోలు బంకుల్లో సంస్థ పేరు, యజమాని పేరు, సంప్రదింపుల నంబర్లు కచ్చితంగా ఏర్పాటు చేయాలి. పంపు యజమాని వాటిని ప్రజలకు కనిపించే విధంగా బంకుల ఎదుట ఏర్పాటు చేయాలి. పెట్రోలు బంకుల్లో బంకులు తెరిచే, మూసివేసే వేళలు తప్పనిసరిగా రాసి ఉంచాలి. పెట్రోలు, డీజిల్ తీసుకున్న తరువాత వినియోగదారులు వాటికి సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా పొందాలి.

ఇలా ఫిర్యాదు చేయండి

పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు అందించాల్సిన సౌకర్యాలు, నిర్వాహకుల విస్మరిస్తే సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్‌ను సంప్రదించడం ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. బంకుల్లో కచ్చితంగా ఉండాల్సిన ఫిర్యాదు రిజిస్టరులో లిఖితపూర్వకంగా ఫిర్యాదు నమోదు చేయొచ్చు. లేదంటే సంబంధిత చమురు సంస్థ సేల్స్ మేనేజర్ పేరు, చరవాణి నంబర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఇవన్నీ అందుబాటులో లేనిచో సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు.

జిల్లాలో పెట్రోల్ బంకులు: 82
రోజు పెట్రోల్ వినియోగం: 1.20లక్షల లీటర్లు
నిత్యం డీజిల్ వాడకం : 1.80లక్షల లీటర్లు
ద్విచక్ర వాహనాల సంఖ్య: 1.45లక్షలు
మూడు, నాలుగు చక్రాల వాహనాలు: 88వేలు

నిందితులను త్వరలో పట్టుకుంటాం

- కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు
- ఎస్సారెస్పీ కార్యాలయం సందర్శన
- ఆఫీస్‌లో పనిచేయని సీసీ కెమెరాలు



ఎస్‌ఈ శివకుమార్‌తో మాట్లాడుతున్న ఏసీపీ

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ నీటి పారుదలశాఖ డివిజన్ 5 కార్యాలయాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు సోమవారం సందర్శించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని అన్నారు. కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన చోరీపై సీఐ స్వామి, ఎస్సై చేరాలుతో కలిసి విచారణ చేశారు. నాలుగు సీపీయూలు, ఐదు మానిటర్లు, రెండు ప్రింటర్లు ఎత్తుకెళ్లినట్లు వాచ్‌మెన్ కనకయ్య ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు కార్యాలయానికి చేరుకున్న ఎస్సై చేరాలు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. సోమవారం క్లూస్‌టీం పిలిపించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. కార్యాలయం ఆవరణలో రెండు సీసీ కెమెరాలు ఉన్నా చాలాకాలంగా పనిచేయడం లేదని చోరీపై ఎస్‌ఈ శివకుమార్‌తో మాట్లాడామని తెలిపారు. కంప్యూటర్లలో విలువైన డేటా ఉందని దానికి సంబంధించిన హార్డ్ కాపీలు తమ వద్ద ఉన్నాయని, పెద్దగా నష్టం లేదని చెప్పారని, అయినా ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని వివరించారు. క్లూస్ టీం ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. కంప్యూటర్లు చోరీ చేసినా డేటా పోలేదని ఈఈ నాగభూషణం తెలిపారు. కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన వివరణ ఇచ్చారు.

గల్ఫ్‌లో గుండెపోటుతో చందుర్తి వాసి మృతి



నాగయ్య(ఫైల్)

చందుర్తి(వేములవాడ): జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మరణించిన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో సోమవారం విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి నాగయ్య ఉరఫ్ కైరా నాగయ్య(56) జీవనోపాధి కోసం సౌదీ అరేబియాకు గత 20 ఏళ్లుగా వెళ్లి వస్తున్నాడు. రెండేళ్ల క్రితమే స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. సౌదీలోనే 15 రోజుల క్రితం పనిచేసే చోట ఛాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని భార్య 15 ఏళ్ల క్రితమే మృతిచెందగా, ముగ్గురు కుమారులు ఉన్నారు.

గోదావరి నదిలో మృతదేహం

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ శివారులోని గోదావరినదిలో సోమవారం పురుషుని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సంతోష్‌కుమార్ సోమవారం తెలిపారు. మృతుడి వయసు సుమారు 40–45 మధ్య ఉంటుందని, నీలిరంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించాడని, మెడలో నల్లటి తాయత్తు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. సంబంధీకులు ఎస్సై సెల్ నంబరు 87126 56527, సీఐ సెల్‌నంబరు 87126 56524లో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ మైనింగ్ సర్దార్ మృతి



మచ్చ రమేశ్ (ఫైల్)

గోదావరిఖని: సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా కాసిప్ట-2 గనిలో పనిచేస్తున్న మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ (37) గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. డిసెంబర్ 22న కాసిప్ట–2గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన రమేశ్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే, కాలి విరిగినట్లు గుర్తించిన వైద్యులు.. ఎక్సరే తీస్తుండగా రమేశ్ అకస్మాత్తుగా మృతి చెందారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే మైనింగ్ సర్దార్ రమేశ్ మృతి చెందాడని సీఐటీయూ నాయకుడు మెంద శ్రీనివాస్ ఆరోపించారు. ఈ ఘటనపై ఏసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా లంగ్స్‌లో బ్లడ్‌క్లాట్ కావడంతో అకస్మాత్తుగా మృతి చెందారన్నారు. పోస్ట్ కోవిడ్‌తో ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని వివరించారు.

గాయపడిన యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్: అప్పన్నపేట వద్ద ఈనెల 6న జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ కనుకుంట్ల రాజేశ్(18) చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. పెద్దపల్లి మండలం దేవునిపల్లికి చెందిన రాజేశ్.. తన సోదరి హారికను అప్పన్నపేటలో దింపేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 8 తులాల వెండి చోరీ

జగిత్యాలక్రైమ్: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన గంజి నర్మద ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకిపాల్పడ్డారు. బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన నర్మద హనుమాన్‌వాడలో అద్దెకుంటోంది. ఈనెల 6న ఇంటికి తాళం వేసి గోపులాపూర్ గ్రామానికి వెళ్లింది. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 8 తులాల వెండిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహమాన్ తెలిపారు.

లింక్ క్లిక్ చేయగానే డబ్బులు విత్‌డ్రా

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎలుపుల బాపు సైబర్ వలలో చిక్కుకొని డబ్బులు పోగొట్టుకున్నాడు. 9440051827 నంబర్ నుంచి వచ్చిన లింక్‌ను బాపు ఓపెన్ చేయగానే వెంటనే రూ. 18 వేలు డ్రా అయినట్లు ఎస్‌ఎంఎస్ వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు కేసు బదిలీ చేశామని పోలీసులు తెలిపారు.

అల్ఫోర్స్‌లో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

జగిత్యాల: ప్రేమ ఆప్యాయత పంచే పండగ సంక్రాంతి అని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కృష్ణానగర్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ ద్వారా సాంప్రదాయాల పరిరక్షణ, సందేశాలు అందించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మల్యాలలో

మల్యాల: మల్యాల మండలంలోని అల్ఫోర్స్ టెక్నో స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను సంస్థ అధినేత నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాకీ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి: జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఖ్యాతి లభిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో నాలుగో తరగతి చదివే కరిక్ పటేల్ జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక కాగా.. సోమవారం విద్యార్థిని అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి రాజస్థాన్‌లో జరిగే జాతీయపోటీలకు ఎంపిక అయినట్లు వివరించారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

యూరియా పంపిణీలో చేతివాటం

- బస్తాకు రూ.9 అదనంగా వసూలు
- ఆందోళనకు దిగిన రైతులు
- వెంటనే రూ.6 తగ్గించి విక్రయాలు



యూరియా లారీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు యూరియాను విక్రయించడంలో సంఘం ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించారు. బస్తాకు రూ.9 పెంచి విక్రయించడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో అప్పటికప్పుడే రూ.6 తగ్గించి అమ్మకాలు సాగించారు. ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో ఆధ్వర్యంలో బండలింగంపల్లిలో సోమవారం ఒక లారీలో 450 యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేయడానికి తీసుకొచ్చారు. సమీప ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో ఒక బస్తాకు రూ.267 విక్రయిస్తుండగా.. బండలింగంపల్లిలో రూ.276 వసూలు చేయడంపై రైతులు ఆందోళనకు దిగారు. దీంతో వెంటనే రూ.270 విక్రయించారు. ఈ విషయంపై సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి వివరణ కోరగా.. నిరాధారమైన ఆరోపణ మాత్రమేనన్నారు. బండలింగంపల్లికి క్లస్టర్ పాయింట్ లేకపోవడంతో లారీలకు అదనపు రవాణా చార్జీల కోసం బస్తాకు రూ.3 చొప్పున మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతకంటే ఎక్కువగా రైతుల నుంచి వసూలు చేస్తే సదరు ఉద్యోగిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుమ్మరిగుట్ట తవ్వకాలపై పరిశీలన

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి శివారులోని కుమ్మరిగుట్ట అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారి సుదర్శన్ సోమవారం పరిశీలించారు. సోమన్‌పల్లి శివారులోని కుమ్మరిగుట్టను కొంతమంది జేసీబీ యజమానులు కొల్లగొడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో గ్రామస్తులు మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. మైనింగ్ అధికారి సుదర్శన్ అక్కడకు చేరుకునేసరికి జేసీబీతోపాటు, ట్రాక్టర్లతో పరారీ అయ్యారు. అక్కడ జరిగిన తవ్వకాలను మైనింగ్ అధికారులు పూర్తిగా పరిశీలించి వచ్చారు.



కుమ్మరిగుట్ట తవ్విన ప్రాంతం

సత్తక్కపల్లి శివారులో చిరుత..?

- పాదముద్రలు గుర్తించిన రైతులు
- అటవీశాఖకు సమాచారమిచ్చిన అన్నదాతలు
- హైనా పాదముద్రలని అనుమానిస్తున్న అధికారులు



శివారు పంటపొలాల్లో పాదముద్రలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారు ఉసికె గుట్ట అటవీ ప్రాంతం సమీపంలో చిరుతపులి పాదముద్రలను రైతులు గుర్తించారు. సోమవారం గ్రామానికి చెందిన ఓ రైతు మొక్కజొన్న చేనులోకి వెళ్లగా.. అక్కడ చిరుతపులి పాదముద్రలు కనిపించాయని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆ ప్రాంతానికి చేరుకున్న అధికారులు పాదముద్రలను పరిశీలించారు. అవి చిరుతపులి పాదాలు కావని, హైనా(తోడేలు) పాదముద్రలు అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ ప్రాంతం వైపు హైనా లేకపోవడం, కొంత చిరుతపులి సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్న అధికారులు.. మరుసటిరోజు మరోమారు పాదముద్రలను పరిశీలిస్తామని అధికారులు రైతులకు చెప్పారు. అటవీ పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘా పెడుతామని ప్రజలు భయాందోళనకు గురికావొద్దని సూచించారు. ఇక్కడ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హఫీజొద్దీన్, బీట్ ఆఫీసర్ శివరాజ్, సిబ్బంది గణేశ్ ఉన్నారు.

పొలంలో కరెంట్ తీగలు అమర్చిన వ్యక్తి అరెస్ట్

- చందుర్తి సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి(వేములవాడ): పంటక్షేత్రంలో అక్రమంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ఒకరికి గాయాలు కావడానికి కారణమైన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని రామన్నపేటకు చెందిన రైతు తిప్పని రాజయ్య పొలం వద్ద వన్యప్రాణులతో పంట పొలం దెబ్బతింటుందని విద్యుత్ తీగలతో కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన బెంద్రం నరసింహారెడ్డి ఉరఫ్ నవీన్‌రెడ్డితోపాటు ఆయన భార్య వర్లత్మ డిసెంబర్ 25న పదలాని కోసం రాజయ్య పొలం వద్దకు వెళ్లడంతో విద్యుత్ తీగలు తగిలి నరసింహారెడ్డి అక్కడే పడిపోయాడు. అప్రమత్తమైన ఆయన భార్య వర్లత్మ అక్కడే ఉన్న మరో రైతు చింతల దేవయ్యతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపి వేయించింది. అప్పటికే విద్యుత్‌షాక్‌తో కాళ్లకు తీవ్ర గాయాలై కిందపడి పోయిన నరసింహారెడ్డి స్థానికుల సహాయంతో గ్రామానికి తీసుకొచ్చి, 108 అంబులెన్స్‌లో వేములవాడకు తరలించారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి.. బాధ్యుడైన తిప్పని రాజయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చినట్లు తెలిస్తే వారిపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. చందుర్తి ఇన్‌చార్జి ఎస్సై రాజేశ్, సిబ్బంది ఉన్నారు.

కన్నబిడ్డను చూడకుండానే..

- కన్నుమూసిన మాతృమూర్తి
- మాతృత్వాన్ని ఆస్వాదించకుండానే మృతిచెందిన బాలింత
- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు



పద్మ(ఫైల్)



వేములవాడ పరిధిలోని నాంపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతురాలు బంధువులు

వేములవాడఅర్బన్: మాతృత్వం కోసం ఆ తల్లి కోటి కలలు కన్నది. దాదాపు 18 ఏళ్ల నిరీక్షణ అనంతరం గర్భవతి కావడంతో మురిసిపోయింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఆ మాతృమూర్తి కన్నబిడ్డను చూడకుండానే కన్నుమూసింది. ఈ సంఘటన వేములవాడలోని నాంపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన చేకూట తిరుపతికి బావుసాయిపేటకు చెందిన పద్మ(35)కు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. చాలా ఏళ్ల తర్వాత గర్భం దాల్చడంతో వేములవాడ మున్సిపల్ పరిధి గల నాంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతీ నెల వైద్యసేవలు పొందింది. ఇందులో భాగంగానే ప్రసూతి కోసం ఆదివారం ఆస్పత్రికి చేరుకుంది. సోమవారం ఉదయం ఆపరేషన్ చేయడంతో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కొంత సమయానికి ఆమె పరిస్థితి విషమిస్తుందని వైద్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్ తీసుకెళ్లగా.. అక్కడికి చేరుకోగానే ఆమె మృతిచెందింది. దీంతో ఆమె బంధువులు నాంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ ఘటనపై వేములవాడ పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

కొండగట్టు(చొప్పదండి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాలేదని కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ మేనేని స్వర్ణలత, నాయకులు మేనేని రాజనర్సింగరావు, శ్రీనివాస్, సింగిరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్నను ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పి.గౌతమి దర్శించుకున్నారు. స్వామివారికి కోడెమొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు.



రాజన్న ప్రసాదం అందిస్తున్న ఆలయ అధికారులు